రాష్ట్రప్రభుత్వ అత్యుత్తమ సర్వీసుకు నిర్వహించే పరీక్షలో అగ్రశ్రేణిలో నిలవడమంటే అంత సులువు కాదు. అందుకు ఏయే అంశాలు దోహదపడతాయో గమనిస్తే... భావి అభ్యర్థులకు అవి మార్గదర్శకం. మన ముందుకు ఏపీపీఎస్‌సీ గ్రూప్‌-I (2011) మొదటి, రెండో ర్యాంకర్లు వచ్చారు. ఒకరిది ప్రకాశం జిల్లా, మరొకరిది శ్రీకాకుళం జిల్లా. స్ఫూర్తిదాయకమైన వారి ప్రిపరేషన్ వ్యూహాలు పరిశీలిద్దాం! భారీ పోటీలో దూసుకువెళ్ళటానికి పట్టుదలతో వారు చేసిన అలుపెరగని కృషిని తెలుసుకుందాం! వారి సూచనలతో ప్రయోజనం పొందుదాం!



# ఇలా నిలిచాం...గెలిచాం!



పరీక్ష స్థాయి కంటే పైస్థాయిలో ప్రిపేర్ కావాలనేది నా సలహా. గ్రూప్స్‌లో నెగ్గాలంటే.. సివిల్స్‌కు సిద్ధం కావాలి.

'గ్రూప్‌-1 పోస్టులా? అలాంటివి మనవల్ల కాదు' అని ఒకప్పుడు భావించిన **ఆకుల వెంకట రమణ** అదే గ్రూప్‌-1 పరీక్ష రాసి ఏకంగా స్టేట్ మొదటి ర్యాంకు సాధించాడు. అది కూడా తొలి ప్రయత్నంలోనే! ఈ గెలుపు వెనక ఏళ్ళతరబడి చేసిన కృషీ, సామాజిక అంశాల అధ్యయనమూ, క్షేత్రస్థాయి అనుభవమూ ఉన్నాయి. ఈ గ్రూప్‌-1 టాపర్ విజయ గాథను విందామా?

## అంతర్జాలం...ఎంతో సాయం

నేను గ్రూప్స్ వైపు యాదృచ్ఛికంగానే వచ్చాను. ఎంవీ ఫౌండేషన్ అనే ఎన్‌జీఓ ద్వారా సామాజికసేవలో భాగంగా పేద పిల్లలకు బోధన చేసేటప్పుడు మాత్రం సివిల్స్, గ్రూప్స్ లాంటి పరీక్షల గురించి అస్పష్టంగా తెలిసింది. ఎన్‌జీఓలు ఎన్ని మంచి పనులు చేస్తున్నా వాటికి పరిమితులుంటాయి. కానీ ప్రభుత్వానికి ఉండవు. అది అతిపెద్ద సేవాసంస్థ. అందుకే ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాదల్చుకున్నాను. లోక్‌సత్తా యూత్ వాలంటీర్‌గా సామాజిక సమస్యలపై అధ్యయనం చేశాను. 2013-16లో హైదరాబాద్ పెండేకంటి లా కళాశాల నుంచి లా చదివాను. సివిల్స్, గ్రూప్స్‌లకు సన్నద్ధం కావటానికి అద్భుతమైన ప్రేరణనిచ్చే ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ గురించి తెలుసుకున్నాను. ఒక అధికారి ప్రజల జీవితాలను ఎంత బాగా మార్చగలడనేదానికి ఆయన మార్గం చూపారు. పైగా పబ్లిక్ సర్వీసులకు జరిపే సన్నద్ధత స్వల్పకాలంలోనే గొప్ప పరిజ్ఞానాన్ని అందిస్తుంది. అందుకే పరీక్షల ప్రిపరేషన్ ఆరంభించాను.

సివిల్స్‌కు కొంత కోచింగ్ తీసుకున్నాను గానీ, గ్రూప్స్‌కి ఎలాంటి శిక్షణా తీసుకోలేదు. పరీక్షల్లో నెగ్గటానికి కోచింగ్ తప్పనిసరేమీ కాదు. కాకపోతే అవగాహన ఆరంభానికి అది పనికొస్తుంది. ప్రస్తుత డిజిటల్ విప్లవ శకంలో ఆరువేల రూపాయిల స్మార్ట్‌ఫోన్ ఇంటర్నెట్ ఉంటే ఎవరైనా అవసరమైన పరిజ్ఞానం సంపాదించవచ్చు. నా ప్రిపరేషన్‌కు అంతర్జాలం (ఇంటర్నెట్) ఎంతగానో ఉపయోగపడింది. ఆర్ఎస్ టీవీ, బీబీసీ డిబేట్లు, టెడ్ టాక్స్, నిపుణుల చర్చలూ పరీక్షల కోణంలో ఎంతో విలువైనవి.

నా సన్నద్ధత సందర్భంగా ఎంతోమందితో మాట్లాడాను. హేతుబద్ధ, విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని రవీంద్ర వేపాటి నాకు పరిచయం చేశారు. డా. జి.వి. రామాంజనేయులు సమాజానికి సంబంధించిన వివిధ అంశాలపై ముఖ్యంగా వ్యవసాయరంగంపై నా దృక్పథాన్ని మెరుగుపరిచారు. అమర్‌నాథ్ వాసిరెడ్డి పర్సనల్ ఇంటర్వ్యూ గైడెన్స్ అందించారు. తుదిఫలితాల్లో 489.5 మార్కులతో మొదటి ర్యాంకు వచ్చింది. ఒక నిర్దిష్ట ర్యాంకుకు గురిపెట్టకుండా అభ్యర్థులు తమ సామర్థ్యాన్ని మెరుగుపరచుకుంటూ ఉండటమే సరైనదని నా ఉద్దేశం. అత్యుత్తమ ప్రదర్శన ఎటూ ఉన్నతమైన ర్యాంకును తెచ్చిపెడుతుంది కదా!

నా ఉద్దేశంలో గ్రూప్‌-1 ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలకు విడివిడి ప్రిపరేషన్ ఉండకూడదు. సమాజం, రాష్ట్రం, దేశం ఎదుర్కొనే సమస్యలకు తన పరిజ్ఞానాన్ని తార్కిక చింతనతో, లోకజ్ఞానంతో అన్వయించటం తెలిసుండాలి. ఈ మూడు అంచెలకూ ఉన్న తేడా... ప్రశ్నలను అడిగే విధానం మాత్రమే. సంబంధిత నైపుణ్యాలను సాధనతో పెంచుకోవాలి.

### విడివిడి సన్నద్ధత వద్దు!

**ప్రిలిమ్స్:** కటాఫ్ 1:50 నుంచి 1:15/12కు మారిన నేపథ్యంలో ప్రిలిమ్స్ చాలా కష్టంగా ఉండబోతోంది. అందుకే నాణ్యమైన ప్రశ్నలను విస్తృతంగా సాధన చేయాలి. యాంత్రికంగా కాకుండా మనసును లగ్నం చేసి చదవాలి. పరీక్షకు కాన్సెప్ట్‌లపై స్పష్టత ఎంతో అవసరం. మనకు ఏది రాదనేదానిపై అవగాహన ఉండాలి. సంబంధం లేని జవాబులను తెలివిగా తొలగించటం నేర్చుకోవాలి. కంగారుగా చదవటం పనికిరాదు. ఏ ప్రశ్నపైనా మరీ ఎక్కువ సమయం వెచ్చించకుండా 'ఆర్ట్ ఆఫ్ లీవింగ్ ద క్వశ్చన్' తెలుసుకోవాలి. స్థూల దృష్టి లోపించిన సూక్ష్మ ఆలోచనా విధానం వల్ల ప్రయోజనం ఉండదు.

**మెయిన్స్:** దీనికి నిమిషానికి కనీసం 15 పదాల చొప్పున రైటింగ్ ప్రాక్టీస్ చాలా అవసరం. ఇది కొద్దిరోజుల్లోనో, నెలల్లోనో సాధ్యం కాదు. ముఖ్యంగా తెలుగు మీడియం నేపథ్యం నుంచి వచ్చిన నాలాంటివారికి ఎక్కువ సాధన తప్పదు. గ్రూప్స్ పరీక్షకు రాసే వేగం చాలా ముఖ్యం. ఎందుకంటే చాలామంది అభ్యర్థులకు తమకు తెలిసినది రాయటానికక్కడా సమయం సరిపోదు. ఎంతోమంది పరీక్ష దగ్గరకొచ్చేవరకూ సమాచారం సేకరించటంలోనే మునిగిపోయి మాక్ టెస్టులు రాయకుండా పొరపాటు చేస్తుంటారు. చదవటమూ, రాయటమూ రోజూ చేయాలి. నేనైతే 60 శాతం వెయిటేజిని రైటింగ్‌కూ, 40 శాతం స్టడీకీ ఇస్తాను. 'బెస్ట్' ఆన్సర్ కోసం కాకుండా జవాబు సంతృప్తిగా రాయటానికి ప్రయత్నించాలి.

**ఇంటర్వ్యూ:** దీనికి నిజాయతీ తప్పనిసరి. ఇంటర్వ్యూలో మరీ వేగంగానో, అతి నెమ్మదిగానో జవాబులు చెప్పకూడదు. సమతూకంలో చెప్పాలి. నా ఇంటర్వ్యూలో ప్రశ్నలు లోతుగానే అడిగారు. 'ప్రభుత్వోద్యోగులందరూ అవినీతి పరులని నేను అనుకుంటాను. ఏమంటావు?' అని ఛైర్మన్ అడిగారు. మంచీ చెడూ అన్ని రంగాల్లో ఉంటాయని చెపుతూ ఉత్తమ అధికారుల పేర్లు కోట్ చేశాను. చెడు ఉదాహరణలు కూడా ఉంటాయని చెప్పాను. అవినీతి తక్కువ ఉండాలంటే.. చట్టాలను కఠినంగా అమలు చేయాలనీ, వాటి లొసుగులను ఉపయోగించుకోకుండా చూడాలనీ చెప్పాను.

### 'మీడియం'పై ఆందోళనా?

ఇంటర్మీడియట్ వరకూ తెలుగుమీడియంలోనే చదివినప్పటికీ ఈ గ్రూప్‌-1 పరీక్షను ఇంగ్లిష్‌మీడియంలోనే రాశాను. విషయం, దాన్ని వ్యక్తీకరించటం గురించి ఆలోచించాలి కానీ, మీడియం గురించి ఆందోళనపడకూడదు. చదివే సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవటం ముఖ్యం. నేను కొన్ని రోజులు కేవలం 4-5 గంటలూ, మరికొన్ని రోజుల్లో అయితే 12-13 గంటలు చదివాను. సబ్జెక్టును ప్రేమించి, నేర్చుకునే ప్రక్రియను ఆస్వాదించాలి. కాన్సెప్టులపై పునాది కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదివాను. మెటీరియల్స్‌పై ఆధారపడకుండా స్టాండర్డ్ పాఠ్యపుస్తకాలు చదివాను. యూట్యూబ్‌లో చాలా వీడియోలు ఉపయోగపడ్డాయి. ప్రభుత్వ నివేదికలెన్నో సమగ్రంగా చదివాను. ఆర్ఎస్ టీవీ, ఆలిండియా రేడియో, మృణాల్, జీకే టుడే, అన్ అకాడమీ వెబ్‌సైట్లు, ఇతర మొబైల్ యాప్స్ ఉపయోగించుకున్నాను.

### ఇవి పాటిస్తే తిరుగుండదు

- ❐ అభ్యర్థులు ప్రిపరేషన్లో నిలకడపై శ్రద్ధ పెట్టాలి.
- ❐ ఇతరులు చెప్పిన దాన్ని గుడ్డిగా పాటించకూడదు. దేనినైనా ప్రశ్నించి, విశ్లేషించి ఒక అభిప్రాయానికి రావాలి.
- ❐ సమాధానాలు సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా ఉండాలి.
- ❐ అడిగిన ప్రశ్న దృక్కోణంలోనే జవాబును సానుకూల దృక్పథంతో రాయాలి.
- ❐ రాజ్యాంగం, ప్రజాస్వామ్యాలపై గొప్ప విశ్వాసం ఉండాలి.
- మొండి పట్టుదలతో కాకుండా ప్రజానుకూల ధోరణి ప్రదర్శించాలి.
- ❐ రాజకీయపరంగా తటస్థత మరో అవసరమైన లక్షణం.
- ❐ పరీక్ష కోసం సమాచారం సేకరించటానికి పరిమితం కాకుండా జ్ఞాన సముపార్జనకు నిజమైన తపన ఉండాలి.
- ❐ సమస్యలను వివరించటమే కాకుండా పరిష్కారాలూ చెప్పగలగాలి.

## సన్నద్ధత నిరంతరం

ఓటమికి కుంగుబాటు సహజం. దాన్ని అధిగమించి, మరో లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు సాగినవారే విజేత. అలా ఒక్కో సోపానాన్ని జాగ్రత్తగా నిర్మించుకుంటూ గ్రూప్‌-1లో రెండో ర్యాంకును సాధించారు **కనుగుల హేమలత**. తన విజయ ప్రస్థానం ఆమె మాటల్లోనే..

చిన్నప్పటినుంచీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాను. దాంతో సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలి అనుకునేదాన్ని. అందుకే నా లక్ష్యం పబ్లిక్ సర్వీస్ అయ్యింది. నిజానికి నాకు ఫిజిక్స్ అంటే ఇష్టం. చిన్నపుడు ఏరోనాటిక్స్ చేయాలనుకునేదాన్ని. ఐఐటీలో సీటు సాధించాలనుకుని విఫలమయ్యాను. దాంతో నిరాశకు గురయ్యాను. అప్పుడు పేపర్లో టాపర్ల విజయగాథలను చదివాను. గ్రూప్స్ గురించి తెలిసిందీ అప్పుడే! దీంతో గ్రూప్స్‌ను నా లక్ష్యంగా చేసుకున్నాను.

లక్ష్యం అయితే ఏర్పడింది కానీ.. ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్థికంగా నిలదొక్కుకున్నాక ఎదగడానికి గ్రూప్స్‌వైపు వెళదామనుకున్నాను. అందుకే ముందుగా డీఈడీని పూర్తిచేశాను. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం చేస్తూనే దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేశాను. వెంటనే గ్రూప్స్, పోటీపరీక్షలకు సన్నద్ధత మొదలుపెట్టాను. అదే ఏడాది డిసెంబరులో గ్రూప్స్ నోటిఫికేషన్ విడుదలైంది. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా సొంతంగా సన్నద్ధమయ్యాను. ఇంటర్వ్యూ వరకూ వెళ్లాను. 13 మార్కులతో సర్వీస్ చేజారింది.

2010 గ్రూప్‌-1 కూడా ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. అప్పుడు ఒక మార్కుతో సర్వీస్ కోల్పోయాను. నిరాశపడినా, సన్నద్ధత ఆపలేదు. ఆ తరువాత 2011లో ప్రకటించిన గ్రూప్‌-1 రాశాను. కానీ దానిని 2012లో క్యాన్సిల్ చేశారు. దానికి 2016లో మళ్లీ మెయిన్స్ పెట్టారు. ఇంటర్వ్యూ ఫిబ్రవరి 16న జరిగింది. మొత్తం 470 మార్కులతో రెండో ర్యాంకు వచ్చింది. నేను కేవలం గ్రూప్స్‌కే పరిమితం కాలేదు. ఈలోపు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్‌ల్లో వేర్వేరుగా పీజీలు చేశాను.

### వైఫల్యాన్ని గమనించుకుని..

ఏదైనా ఒత్తిడి లేకుండా సింపుల్‌గా చేసుకుంటూ పోవాలనే మనస్తత్వం నాది. దాన్నే నా సన్నద్ధతలోనూ ఆచరణలో పెట్టాను. వార్తాపత్రికలను ముఖ్యంగా ఎడిటోరియళ్లను పరీక్ష కోణంలో చదవడం అలవాటు చేసుకున్నా. సమాచారాన్ని సేకరించుకుని సొంతంగా నోట్స్ తయారు చేసుకున్నాను. మెయిన్స్ విషయంలో ఎక్కడ విఫలమవుతున్నానో చూసుకున్నాను. నాలుగో పేపర్‌లో తక్కువ మార్కులు రావడాన్ని గమనించాను. ఈ అంశానికి సంబంధించి ఇంటర్వ్యూలోనూ ఇదే పరిస్థితి. నా జవాబుల్లో తాజాదనం లోపించడమే కారణం అనిపించింది. దీంతో కేంద్రప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ వెబ్‌సైట్‌ను అనుసరించాను. ఇస్రో యాప్‌లనూ అనుసరించాను. పరీక్షలో బయాలజీ విషయాలను వివరించేటప్పుడు ఫ్లోచార్టులు, బొమ్మలు ఉపయోగించాను.

### బృందంతో...

మొత్తంగా నాలుగుసార్లు గ్రూప్స్‌కు హాజరవడంతో పరీక్షపై కొంత అవగాహన వచ్చింది. మధ్యలో చాలా విరామం వచ్చినా ఏదో ఒక పోటీ పరీక్ష రాస్తుండటంతో సన్నద్ధత కొనసాగుతూనే ఉంది. పరీక్షకు చాలా తక్కువ సమయం ఉండటంతో సన్నద్ధతలోనూ కొన్ని మార్పులు చేసుకున్నాను. పేపర్-1కు సంబంధించి గ్రూప్స్‌కు సీరియస్‌గా సిద్ధమవుతున్న నలుగురు అభ్యర్థులం కలిసి పరీక్షలో వచ్చే అవకాశమున్న అంశాల జాబితా తయారు చేసుకున్నాం. ఎవరెవరు ఏ అంశంలో నిష్ణాతులో వాటిని తీసుకున్నాం. వాటి సమాచారాన్ని సేకరించుకుని పంచుకున్నాం. ఇది మిగతా పేపర్లకూ ఉపయోగపడింది. దానివల్ల లోతైన అధ్యయనం సాధ్యమైంది.

నా అధ్యయనానికి తెలుగు అకాడమీ పుస్తకాలతోపాటు ప్రభుత్వ వెబ్‌సైట్లు ఎక్కువగా ఉపయోగపడ్డాయి. ప్రభుత్వ పత్రికలూ కీలకమే. ఇలా డైరెక్ట్ సోర్స్‌లను ఉపయోగించడం లాభించింది.

సన్నద్ధతకు రోజూ 3-4 గంటలు కేటాయించేదాన్ని. సిలబస్ కవర్ అయ్యిందా లేదా అనేదానిపైనే ఎక్కువగా దృష్టిపెట్టాను.

**ఇంటర్వ్యూలో:** 90% ప్రశ్నలు ప్రస్తుతం నేను చేస్తున్న ఉద్యోగానికి సంబంధించినవే అడిగారు. అప్పుడే బడ్జెట్ విడుదలవడంతో దానికి సంబంధించి 2-3 ప్రశ్నలు, డెప్యూటీ కలెక్టర్ ఉద్యోగ ప్రొఫైల్, వ్యక్తిగత జీవితంపై మిగతా ప్రశ్నలను అడిగారు.

### అభ్యర్థులకు సూచనలు

- ✭ సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి.
- ✭ పరీక్షలతో సంబంధం లేకుండా వార్తాపత్రికలను చదువుతూ ఉండాలి. ముఖ్యంగా ఎడిటోరియల్స్ చదవాలి. వాటిలో సిలబస్‌కు సంబంధించిన అంశాలు కనిపిస్తే సేకరించి తరచూ చదువుతుండాలి.
- ✭ తెలుగు మాధ్యమంవారు ప్రాథమికాంశాల కోసం అకాడమీ పుస్తకాలను అనుసరిస్తే సన్నద్ధత తేలికవుతుంది.
- ✭ ప్రభుత్వ వెబ్‌సైట్లను తరచూ చూస్తుండాలి. ముఖ్యమైన అంశాలను సీరియస్ అభ్యర్థులతో బృందంగా ఏర్పడి చర్చిస్తుండాలి.
- ✭ గత ప్రశ్నపత్రాలు వెబ్‌సైట్లలో దొరుకుతుంటాయి. వాటిని చూసుకుంటుండాలి. సమాధానాలు రాయడం ప్రయత్నించాలి.
- ✭ మెయిన్స్‌లో ఎస్సే పేపర్‌కు వచ్చే అవకాశమున్న ప్రశ్నలను జాబితాగా రాసుకుంటుండాలి. నోటిఫికేషన్ వచ్చినప్పటినుంచి ఇలా చేస్తుండాలి. 10-15 ప్రశ్నలకు మాదిరి ఎస్సేలను తయారు చేసుకోవాలి. పరీక్షలో ఇవే ప్రశ్నలు వస్తే సమాధానాలు రాయడం తేలికవుతుంది. ఒకవేళ రాయకపోయినా పరీక్ష స్వరూపం అర్థమవుతుంది. ఇలా చేస్తే ప్రశ్న తెలియకపోయినా కరెంట్ అఫైర్స్ చదువుతుంటారు కాబట్టి, కనీస అవగాహన ఏర్పడే అవకాశముంటుంది.

# పిలుస్తున్నాయి... గురుకులాలు

**మంచి చదువులు... మెరుగైన బోధన... రుచికరమైన భోజనం... ఆటలతోపాటు పోటీ పరీక్షలకు శిక్షణ... ఇంటిని మరిపించే సౌకర్యాలు... ఇవన్నీ కావాలంటే... లక్ష రూపాయలు జేబులో ఉంటే ఏ కార్పొరేట్ విద్యా సంస్థలోనైనా చేరిపోవచ్చు. అయితే లక్షలు లేకపోయినప్పటికీ ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఇలాంటి సౌకర్యాలే ఉచితంగా దక్కాలంటే?**

చదువు, వసతి,భోజనం అన్నీ ఉచితమే

ఆంగ్ల మాధ్యమంలో విద్యాభ్యాసం

ఈ ప్రశ్నకు సమాధానమే గురుకులాలు... సమర్థులైన ఉపాధ్యాయులతో బోధన, మెరుగైన వసతి సౌకర్యాలు... మంచి పౌష్టికాహారం... ఆటపాటల్లో శిక్షణ... విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా కార్పొరేట్ సంస్థలను మించిన ఏర్పాట్లు గురుకులాల సొంతం. ఇక్కడి విద్యార్థులు చదువులో రాణిస్తూనే కొత్త రికార్డులూ సృష్టిస్తున్నారు. ఎవరెస్టునీ అధిరోహించారు... విదేశాలనూ చుట్టొచ్చారు. ఇలాంటి అవకాశం మీ పిల్లలకూ దక్కాలని కోరుకుంటున్నారా? అయితే మీకోసమే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 497 గురుకుల పాఠశాలలు ఎదురుచూస్తున్నాయి. కేవలం ప్రతిభ, సామాజిక వెనుకబాటు, స్థానికత ప్రాతిపదికగా తెలంగాణ గురుకులాలు అయిదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి.

### కేటాయింపు ఇలా...

పాత జిల్లాలను యూనిట్‌గా చేసుకుని విద్యార్థులను ఎంపికచేస్తారు. సర్వేల్ గురుకులంలో మాత్రం రాష్ట్రస్థాయి ప్రతిభ ద్వారా ఎంపికచేస్తారు. అన్ని జిల్లాల విద్యార్థులూ ఇక్కడి సీట్ల కోసం పోటీ పడవచ్చు. ప్రవేశపరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్, స్థానికత ప్రాతిపదికన విద్యార్థులను గురుకులాల్లోకి తీసుకుంటారు. కొడిపల్లి గురుకులానికి మత్స్యకార వృత్తికి చెందిన అన్ని జిల్లాలవారు అర్హులు. ఎంపికైనవారిని అయిదో తరగతిలోకి ప్రవేశం కల్పిస్తారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. ఈ పరీక్ష ద్వారా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 232 సాంఘిక సంక్షేమ గురుకులాలు, 88 గిరిజన సంక్షేమ గురుకులాలు, 142 బీసీ సంక్షేమ గురుకులాలు, 35 టీఆర్ఈఐఎస్ జనరల్ గురుకులాల్లో ప్రవేశం లభిస్తుంది.

### ప్రత్యేకతలివీ...

అమ్మలాంటి ఆప్యాయత, నాన్నలాంటి ఆదరణ... ఈ రెండింటి మేళవింపునకు ఆధునిక గురుకులాలు చిరునామాగా నిలుస్తున్నాయి. ఇక్కడ సీటు లభిస్తే తల్లిదండ్రుల కల నెరవేరినట్టే.. విద్యార్థుల ఆశయం సాధ్యమైనట్టే. ఎందుకంటే ఇక్కడి ఉపాధ్యాయులు కేవలం పాఠశాల సమయానికే పరిమితం కాకుండా నిరంతరం విద్యార్థులను పర్యవేక్షిస్తారు. పాఠశాల తరగతులు ముగిసిన తర్వాత ఆటలు, విరామం తర్వాత ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్ ఉంటాయి. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవచ్చు. ప్రతి తరగతికీ హౌస్ టీచర్ ఉంటారు. వీరు విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకుంటారు. చదువులో వెనుకబడిన, ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారిస్తారు. అలాగే చదువు విషయంలో విద్యార్థులపై ఒత్తిడి ఉండదు అలాఅని చెప్పి నేర్పడంలో రాజీ పడరు. పై తరగతుల విద్యార్థులకు ఒలంపియాడ్, ఐఐటీ, నీట్, ఎంసెట్... తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తారు. ఆటల్లోనూ తర్ఫీదునిస్తారు. వీటన్నింటితోపాటు పోషక విలువలతో కూడిన భోజనం (మాంసాహారం, గుడ్లు, అరటిపళ్లు, చిరుతిళ్లు ఇవన్నీ అందిస్తారు), పుస్తకాలు, యూనిఫారంతోపాటు పాదరక్షలు, సబ్బు, దువ్వెన, పేస్టు ఇలా అవసరమైన సామగ్రి అంతా ఇస్తారు.




### దరఖాస్తు చేసేటప్పుడు...

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పుడు పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల మొబైల్ నంబరు, ఆధార్ నెంబరు, జిల్లా పేరు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలి. దరఖాస్తు సమర్పించిన తర్వాత ఏవైనా తప్పులు దొర్లినట్లు గుర్తించినప్పటికీ మార్పులకు అవకాశం ఉండదు. అందువల్ల అప్‌లోడ్ చేయడానికి ముందే మరోసారి వివరాలు సరిచూసుకోవాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 16, **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 8 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు

**హాల్ టికెట్లు:** పరీక్షకు పది రోజుల ముందు నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**ఫీజు:** రూ. 50. http://tgcet.cgg.gov.in

### ప్రవేశం లభించాలంటే...

**అర్హత:** ప్రస్తుతం విద్యార్థి 4వ తరగతి చదువుతుండాలి.

**వయసు:** ఓసీ, బీసీలైతే 9 నుంచి 11 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే సెప్టెంబరు 1, 2007 - ఆగస్టు 31, 2009 మధ్య జన్మించినవాళ్లు అర్హులు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య వయసులో ఉండాలి. అంటే సెప్టెంబరు 1, 2005 - ఆగస్టు 31, 2009 మధ్య జన్మించినవాళ్లు అర్హులు.

**ఆదాయ పరిమితి:** తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలవారైతే రూ. 1,50,000 పట్టణ ప్రాంతాల్లో నివసిస్తే రూ. 2 లక్షల లోపు ఉండాలి.

**ఎంపిక విధానం:** రాతపరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా.

### పరీక్ష ఇలా..

వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. తెలుగు 20, ఇంగ్లిష్ 25, గణితం 25, పరిసరాల విజ్ఞానం 25, మెంటల్ ఎబిలిటీ 5 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. జవాబులను ఓఎంఆర్ పత్రంపై గుర్తించాలి.

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### తెలంగాణ సెర్ప్

**సంస్థ:** తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్).
**పోస్టు:** ప్రాజెక్ట్ మేనేజర్ తదితరాలు
**ఖాళీలు:** 03
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ లేదా పీజీతోపాటు అనుభవం.
**ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా.
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
**చివరితేది:** 08.03.2018
**వెబ్‌సైట్:** www.serp.telangana.gov.in

#### ఏటీఐ, హైదరాబాద్

**సంస్థ:** భారత నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఐ).
**పోస్టు:** జూనియర్ కన్సల్టెంట్
**ఖాళీలు:** 07
**జాబ్ లొకేషన్:** విద్యానగర్, హైదరాబాద్.
**అర్హత:** బీటెక్/ బీఈ లేదా డిప్లొమాతోపాటు సంబంధిత రంగంలో అనుభవం.
**ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.
**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
**చివరితేది:** 15.03.2018
**వెబ్‌సైట్:** http://atihyderabad.ap.nic.in/

### ప్రవేశాలు

#### స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఢిల్లీ

**కోర్సులు:** యూజీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రాములు
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ.
**ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ (యూజీ ప్రోగ్రాములకు జేఈఈ మెయిన్ స్కోరు ద్వారా).
**రాతపరీక్ష/ ఇంటర్వ్యూ:** 2018 ఏప్రిల్ 2 నుంచి 4 వరకు.
**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
**దరఖాస్తు ఫీజు:** రూ. 2,500.
**చివరితేది:** 16.03.2018
**వెబ్‌సైట్:** http://spa.ac.in/

#### ఎన్‌సీహెచ్ఎంసీటీ, నోయిడా

**సంస్థ:** నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్ఎంసీటీ), నోయిడా.
**కోర్సు:** ఎంఎస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్-194 సీట్లు
**అర్హత:** బీఎస్సీ ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్.
**ఎంపిక:** రాతపరీక్ష ద్వారా.
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
**దరఖాస్తు ఫీజు:** రూ. 900.
**చివరితేది:** 25.04.2018.
**వెబ్‌సైట్:** http://nchm.nic.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

# విద్యార్థులకు వరం... గురుకులం

## మంచి చదువులు, మెరుగైన వసతులు

**అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు... ఉన్నత విద్యా ప్రమాణాలు... మెరుగైన వసతులు... పోటీ పరీక్షలతోపాటు క్రీడల్లో శిక్షణ... విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి కృషి... పోషక విలువలతో కూడిన భోజనం... నిరంతర ఉపాధ్యాయుల పర్యవేక్షణ... వీటన్నింటి కలబోతే గురుకులాలు. వీటిని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా చెప్పుకోవచ్చు. నాలుగో తరగతి అంశాలపై పరీక్ష నిర్వహించి, అయిదో తరగతిలోకి ప్రవేశం కల్పించే గురుకులాల నోటిఫికేషన్ విడుదలయింది. ఆ వివరాలు...**




### ఎన్నో ప్రత్యేకతలు...

కార్పొరేట్ పాఠశాలల హవా నడుస్తోన్న ఈ రోజుల్లో గురుకులాలు వాటికి మించిన ఫలితాలు సాధిస్తున్నాయి. ఇక్కడి విద్యార్థులు ఎందరో ఉన్నత విద్యాసంస్థల్లో అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. పాఠశాల సమయానికే పరిమితం కాకుండా ఇక్కడి ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులను పర్యవేక్షిస్తారు. తరగతుల అనంతరం ఆటలు, విరామం తర్వాత ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్ ఉంటాయి. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవచ్చు. ప్రతి తరగతికీ హౌస్ టీచర్ ఉంటారు. వీరు విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకుంటారు. చదువులో వెనుకబడిన, ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. అలాగే చదువు విషయంలో విద్యార్థులపై ఒత్తిడి ఉండదు అలాఅని శిక్షణలో రాజీ పడరు. పై తరగతుల విద్యార్థులను ఒలంపియాడ్, ఐఐటీ, నీట్, ఎంసెట్... తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఏ అంశంలోనైనా ప్రత్యేక ప్రతిభ ఉంటే ప్రోత్సహిస్తారు. అందులో రాణించేలా ప్రత్యేక శిక్షణ సైతం అందిస్తారు. వీటన్నింటితోపాటు పోషక విలువలతో కూడిన భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్సులు, యూనిఫాం.. ఇలా అవసరమైన సామగ్రి అంతా ఇస్తారు. అందువల్ల విద్యార్థులు ఎలాంటి ఆర్థిక చింత లేకుండా మంచి వాతావరణంలో చదువుకోవచ్చు. ప్రతి జిల్లాలోనూ బాలబాలికలకు ప్రత్యేకంగా గురుకులాలు ఉన్నాయి. ప్రవేశం లభించినవాళ్లు అయిదో తరగతి నుంచి పదో తరగతి వరకు నిశ్చింతగా చదువుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ, బీసీ వెల్ఫేర్, జనరల్ మొదలైన వాటి పరిధిలో 308 గురుకులాలు ఉన్నాయి. వీటిలో 24820 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశం లభించిన విద్యార్థులకు అయిదో తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు. లైబ్రరీ, ల్యాబ్స్, కంప్యూటర్ ఎడ్యుకేషన్, డిజిటల్ తరగతులు..మొదలైన సౌకర్యాలు ఉంటాయి.

### సీట్ల కేటాయింపు ఇలా...

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్, జిల్లాల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. బాలురు, బాలికలకు విడిగా మెరిట్ జాబితా సిద్ధం చేస్తారు. విద్యార్థులు 3,4 తరగతులను చదువుకున్న జిల్లాకు స్థానికులవుతారు. ఆ జిల్లాలోని గురుకులాల్లో ప్రవేశం లభిస్తుంది. కొన్ని గురుకులాలకు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల విద్యార్థులూ పోటీ పడవచ్చు.

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 20

దరఖాస్తు రుసుము చెల్లించనవసరం లేదు. అన్ని వర్గాల విద్యార్థులూ ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

**పరీక్ష తేదీ:** ఏప్రిల్ 8 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు

## బోధన, వసతి, భోజనం అన్నీ ఉచితమే

**హాల్‌టికెట్లు:** ఆన్‌లైన్ అప్లికేషన్ పూర్తిచేసిన తర్వాత హాల్ టికెట్ ప్రింట్ తీసుకుని పరీక్ష కేంద్రానికి వెళ్లొచ్చు.

**వెబ్‌సైట్:** https://apgpcet.apcfss.in

### పరీక్ష ఇలా...

యాభై మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున యాభై ప్రశ్నలు వస్తాయి. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (సైన్స్, సోషల్) అంశాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. తెలుగు 10, ఇంగ్లిష్ 10, మ్యాథ్స్ 10, సైన్స్ 10, సోషల్ 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో ఉంటుంది. ఆయా జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న పాఠశాలను పరీక్ష కేంద్రంగా ఎంచుకోవచ్చు.

### ప్రవేశం లభించాలంటే...

**అర్హత:** విద్యార్థులు ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్నవారై ఉండాలి.

**వయసు:** ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే సెప్టెంబరు 1, 2005 - ఆగస్టు 31, 2009 మధ్య జన్మించినవారై ఉండాలి. ఓసీ, బీసీలు సెప్టెంబరు 1, 2007 - ఆగస్టు 31, 2009 మధ్య జన్మించాలి.

**ఆదాయం:** తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షలోపు ఉండాలి.

---

## ప్రభుత్వ ఉద్యోగాలు

### తెలంగాణ సెర్ప్

సంస్థ: తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్).

**పోస్టు:** ప్రాజెక్ట్ మేనేజర్ తదితరాలు

**ఖాళీలు:** 03

**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ లేదా పీజీతోపాటు అనుభవం.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.

**చివరితేది:** 08.03.2018

వెబ్‌సైట్: www.serp.telangana.gov.in

### ఏటీఐ, హైదరాబాద్

సంస్థ: భారత నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఐ).

**పోస్టు:** జూనియర్ కన్సల్టెంట్

**ఖాళీలు:** 07

**జాబ్ లొకేషన్:** విద్యానగర్, హైదరాబాద్.

**అర్హత:** బీటెక్/ బీఈ లేదా డిప్లొమాతోపాటు సంబంధిత రంగంలో అనుభవం.

ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.

**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్

**చివరితేది:** 15.03.2018

వెబ్‌సైట్: http://atihyderabad.ap.nic.in/

## ప్రవేశాలు

### స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఢిల్లీ

**కోర్సులు:** యూజీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రాములు

**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ.

ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ (యూజీ ప్రోగ్రాములకు జేఈఈ మెయిన్ స్కోరు ద్వారా).

**రాతపరీక్ష/ ఇంటర్వ్యూ:** 2018 ఏప్రిల్ 2 నుంచి 4 వరకు.

**దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.

**దరఖాస్తు ఫీజు:** రూ.2,500.

**చివరితేది:** 16.03.2018

వెబ్‌సైట్: http://spa.ac.in/

### ఎన్‌సీహెచ్ఎంసీటీ, నోయిడా

సంస్థ: నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ), నోయిడా.

**కోర్సు:** ఎంఎస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్-194 సీట్లు

**అర్హత:** బీఎస్సీ ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్.

ఎంపిక: రాతపరీక్ష ద్వారా.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.

**దరఖాస్తు ఫీజు:** రూ.900.

**చివరితేది:** 25.04.2018.

వెబ్‌సైట్: http://nchm.nic.in/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**